"హితశ్రీ"

వాకిట్లో బండి ఆగిన చప్పుడు విని పద్మ బయటికొచ్చింది. సత్యనారాయణ అప్పుడే బండి దిగుతున్నాడు.

'పరీక్షలు బాగా రాశావా, బావా?'

అతను తలెత్తి చూశాడు. మాసినగడ్డం, లోతుకుపోయిన కళ్ళూ, మ్లానవదనం చూసి పద్మ హృదయం కలుక్కుమంది.

'ఆఁ'

'బాగా చదివినట్టున్నావు.'

'బాగానే చదివాను' అతను నిరుత్సాహంగా జవాబిచ్చాడు.

'సరిగ్గా ఈ బండికే వొస్తావనుకున్నాను. అలాగే వొచ్చావు. చూశావా, ఎంత సరిగా ఊహించానో!'

అతను తలెత్తి పద్మవైపు చూశాడు. మిలమిలా మెరిసే ఆమె కళ్ళలోకి ఒక్కసారి చూసి తటాలున కిందికి చూపుల్ని మరలించాడు. పద్మ ఊహించినట్టుగా అతను చిరునవ్వు నవ్వలేదు.

'ఊఁ' అనిమాత్రం అన్నాడు. పద్మ అతనివైపు కొంత వింతగా చూసింది

'అత్తయ్య దొడ్లో పూజ చేసుకుంటున్నట్టుంది పిలుస్తానుండు.'

'ఒద్దులే పద్మా, మా అమ్మకి ఆ పూజలోనే శాంతి దొరుకుతుంది. ఈ దౌర్భాగ్యుడు ఆమెకి అశాంతి తప్ప ఇంకేమీ ఇవ్వలేదు.'

పద్మ అతనివైపు విస్మయంగా చూసింది. ఒక క్షణం ఆగి, అతని కళ్ళలోకిచూస్తూ 'పరీక్ష ఏమైనా చెడగొట్టావా, బావా?' అంది నెమ్మదిగా.

సత్యనారాయణ ఆమెమాటలకి సమాధానంగా 'ప్చ్' అని మాత్రం అని ఇంట్లోకి నడిచాడు. పద్మకి ఆ సమాధానం సరిగా అర్థం కాలేదు. 'ప్చ్' అనటం ఆమెకి సమాధానం గానో లేక అతని మానసిక వేదనతోనో ఆమెకి సరిగా తెలియలేదు. ఆమెకి తెలిసినంతలో సత్యనారాయణ పరీక్ష బాగా రాయకపోవటానికి కారణం ఏమీ లేదు. సత్యనారాయణ తెలివితేటల్ని గురించిగాని, అతనికి చదువుపట్ల గల శ్రద్ధాసక్తుల విషయంలోగాని ఎవరికీ ఏవిధమైన అనుమానాలూ లేవు.

పద్మ అతని వెనకనే ఇంట్లోకి వెళ్ళింది. తల్లీ, కొడుకూ మాట్లాడుకుంటూ ఉండటం చూసి మళ్ళీ వెనక్కి వెళ్ళి పోబోతుండగా సత్యనారాయణ తల్లి చూసి కేకేసింది.

'అదేమిటే పద్మా, కొత్తదానివల్లే అలా వెనక్కి వెళ్ళిపోతావేమిటి? వాడు వొచ్చేదాకా బావో, బావో అని కలవరించి తీరా వాడు వొచ్చింతరవాత పారిపోతే ఏం లాభం?'

పద్మ సిగ్గుపడ్డది. వెనక్కి ముందుకీ వెళ్ళకుండా అక్కడే నిలబడ్డది.

'పూజ మధ్యలో లేచి వొచ్చాను. అది ముగించుకు వొస్తా, మాట్లాడుకుంటూ ఉండండి సరదాగా. వొచ్చేనెలలో ఆ అడ్డుకికూడా తీరితే...' మాట పూర్తిచేయకుండానే సత్యనారాయణ తల్లి లోపలికి వెళ్లిపోయింది.

సత్యనారాయణ పడక కుర్చీలో పడుకుని అలంకారంగా చేతిలో ఓపుస్తకం పట్టుకున్నాడు.

'ఎంత ఇంజనీరింగు చదువయితే మాత్రం అంతగా ఆరోగ్యం పాడయేట్టు చదువుతారా, ఎవరయినా?' పద్మ అతనికి దగ్గరగా వొచ్చి అంది.

'చదవకుండా ప్యాసవుతారా, ఎవరయినా?'

'నిజంగా తగ్గిపోయావు సత్యం బావా.'

అతను జవాబివ్వకుండా పుస్తకం పేజీలు తిప్పాడు. పద్మ అతనివైపు రెప్పవాల్చకుండా చూడసాగింది. అలాగే కొన్నినిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి.

'మద్రాసు కబుర్లు చెప్పవేం బావా? చదివి చదివి ఇవ్వాళేగా వొస్తివి, అప్పుడే ఆ పుస్తకమేదో ముందరేసుకు కూచున్నావేం?'

అతను తలెత్తి పద్మవైపు ఓసారి చూసి వెంటనే పక్కకి తిప్పాడు దృష్టుల్ని.

'ఏమున్నాయి. కబుర్లు?'

మళ్ళీ నిశ్శబ్దం ఆవరించింది గదిలో. అతని వైఖరి ఆమెకేమీ అర్థం కాలేదు.

'చూస్తే నువ్వు నాతో మాట్లాడ దలుచుకోలేదల్లే ఉంది' అతను పుస్తకం మూసేశాడు.

'ఏం మాట్లాడను?'

పద్మ అతనివైపు 'నీకేం జరిగింది?' అనే భావంతో చూసింది.

'ఏం మాట్లాడను?-' ఇంత చచ్చు ప్రశ్న అతనెప్పుడూ అడగలేదు.

'ఇదివరకల్లా ఏం మాట్లాడావు?'

ఈ మాటలు విని సత్యనారాయణ ఓసారి గట్టిగా గాలి పీల్చి కిటికీలోంచి ఆకాశంలోకి చూశాడు. అతని నుదురుపైన ముడతలు అతను ఏదో ఆలోచనలో పడ్డాడని చెప్పకనే చెబుతున్నాయి. అతని ముఖంలో కాంతి తగ్గింది. ఉండి ఉండి గట్టిగా నిట్టూర్పు వొదలసాగాడు. పద్మ కేదంతా అయోమయంగా ఉంది.

'ఏమయింది బావా నీకు? ఇలా అయిపోయావు.'

అతనీ మాటలు వినలేదు. ఆమె మళ్ళీ అడిగింది. కాని ఈ సారికూడా అతనికి వినబడలేదు. పద్మకి కాస్త కోపం వొచ్చింది. కొంచెం తీక్ష్ణంగా అంది-

'నేను వెడుతున్నా'

ఈ మాటలు కాస్త గట్టిగా అంటంవల్ల అస్పష్టంగా సత్యనారాయణ వినగలిగాడు. పద్మ లేచి నుంచుని మళ్ళీ అంది కోపంగా.

'నీ కంత ఇష్టం లేకపోతే, నేను వెడతాలే'

సత్యనారాయణ ఊహా ప్రపంచంనుంచి తిరిగొచ్చి 'ఆఁ?' అన్నాడు.

'నేను వెడుతున్నా'

అతను పద్మ వైపు చూశాడు. 'వెళ్ళమన్నావా?' అన్నట్టుగా. ఆమె వెళ్ళిపోతుంది కాబోలన్నట్టుగా అతనికి తోచింది.

'వెడుతున్నావా?'

'ఊఁ ఎన్నిసార్లు చెప్పాలి?'

'ఊఁ' అతను తల కిందికి దించేశాడు. పద్మ రోషంతో చరచర వెళ్ళి పోయింది. ఆమె వెళ్ళిపోయిం తరవాత అటువైపే స్థిరంగా చూశాడు సత్యనారాయణ. అతని మెదడులో ఏవేవో భావాలు కదిలాయి. శూన్యంలోకి చూస్తున్న అతని కళ్ళనుండి అశ్రుబిందువులు నేలమీద రాలాయి. వణకుతున్న అతని పెదవులనుంచి 'పద్మ' అనే మాటలు వెలువడ్డాయి.

'ఇప్పుడే గదురా పద్మ వాళ్ళింటికి వెళ్ళింది' అంది సత్యనారాయణ తల్లి అప్పుడే వొస్తూ. అతడు తటాలున పక్కకి తిరిగి కళ్ళు తుడుచుకున్నాడు.

'చదువు అయిపోయింది. ఇహ పెళ్ళే ఉంది అది కూడా అయితే'-

సత్యనారాయణ ఏమీ మాట్లాడలేదు.

'పిచ్చిపిల్ల, నువ్వంటే ప్రాణం! ఎప్పుడూ నిన్ను గురించే, నీ తెలివి తేటల్ని గురించే మాట్లాడుతుంది. నిజంగా పద్మలాంటివాళ్లు అరుదురా, సత్యం'

అతను లేచి నిలబడ్డాడు.

'ఇప్పుడే వొస్తానమ్మా, అలా బయటికెళ్ళొస్తా'

'ఎంత సిగ్గురా నాయనా! ఆడవాళ్ళే నయం' అనుకుంది అతని తల్లి. సత్యనారాయణ దుస్తులు కూడా మార్చుకోకుండా, అలాగే బయలుదేరాడు. అతని ముఖంలో కళలేదు. కిటికీలోంచి పద్మ అతనివైపు అర్థంకాని చూపులు చూసింది. ఏమిటలా అయిపోయాడు? పరీక్ష దిగులు అయివుండదు. ఒకవేళ పరీక్ష చెడగొట్టినా అంత

బేజారయే తత్వం కాదు అతనిది. ఏదో మానసిక బాధ అతన్ని పీడిస్తోంది. ఇరవై రెండేళ్ల సత్యానికి ఒక స్త్రీని ప్రేమించి ఆమెని వివాహం చేసుకో బోతున్న సత్యానికి మానసిక బాధలు ఏం ఉంటాయో ఆమె కర్థం కాలేదు. బయటికి వెడుతూ సత్యం అతనికి తెలియకుండానే పద్మ వాళ్ళ ఇంటివైపు చూశాడు. కిటికీలోంచి తన వైపే చూస్తున్న పద్మని గమనించాడు. ఒక్క క్షణం అలాగే ఆమె వైపు చూసి గిరుక్కున చూపుమరలించి చకచకనడిచిపోయాడు. కాంతి హీనమైన ముఖంతో పద్మ అతనువెళ్లిన దారి వైపు అతను కనిపించేదాకా చూసి తరవాత ఆకాశంలోకి నీళ్లు నిండిన కళ్లని తిప్పింది.

రోజులిలా గడిచి పోతున్నాయి. సత్యనారాయణ వైఖరిలో మార్పేమీ లేదు. పద్మతో అతను సరిగా మనసిచ్చి మాట్లాడలేదు. ఎప్పుడూ దేనిని గురించో దీర్ఘంగా ఆలోచిస్తుంటాడు. రానురాను పద్మకి ఈ పరిస్థితి దుర్భరం కాసాగింది. అతని బాధేమిటో ఖండితంగా అడిగి తేల్చేసుకుని దానికి తగినమందు వెయ్యకపోతే సత్యం తనకి దూరమయిపోతాడని ఆమెకి అధైర్యం కలిగింది. ఇది ఇలా ఉండగా సత్యం పరీక్షా ఫలితాలు వొచ్చాయి. అతను సెకండ్ క్లాసులో అనుకున్నట్టుగానే ప్యాసయాడు. అయినా అతనిలో కలిగిన మార్పేమీ లేదు. దీంతో పద్మకి పూర్తిగా గాభరా పుట్టింది.

ఓరోజు మాటలసందర్భంలో అన్నాడు సత్యనారాయణ-

'నాకు మాచెర్ల దగ్గిర ఉద్యోగం అయింది పద్మా. రెండు మూడు రోజుల్లో వెడతాను.'

ఈ వార్త పద్మకి అశనిపాతంలా అయింది. అసలే ఇలా ఉన్నాడు. ఇహ పరాయిచోటికి కూడా వెడితే... అయినా లేని ఉత్సాహం తెచ్చుకుని అంది.

'ఎప్పుడు జాయిన్ కావాలి ఉద్యోగంలో?'

'సాధ్యమయినంత త్వరలో'

'బావా, కొన్నాళ్లు ఉద్యోగంలేకపోతేనేం? బి. ఇ. ప్యాసైనావు. నువ్వు కావాలన్నపుడు పిలిచి ఉద్యోగం ఇస్తారాయె. ఇప్పుడు వెళ్ళకపోతేనేం?'

'వెళ్ళాలి పద్మా' అన్నాడు ముక్తసరిగా అతను.

'మళ్లీ ఎప్పుడు రావటం, అయితే?'

'నీ పెళ్ళికే' అతను విషాదంగా చిరునవ్వు నవ్వాడు. అది చిరునవ్వు అని ఎవరూ అనలేరు, దానికి భాషలో నిర్వచనం లేదు.

పద్మ సిగ్గుగా పక్కకి తలతిప్పి చిన్నగా నవ్వింది.

'గొప్పవాడివేలే, పెళ్ళికి ఎలాగూ వొస్తావు. ఈ మధ్య.'

'ఈమధ్య రానేమో! నీ పెళ్ళి చూసి మళ్ళీ ఆ రోజే వెళ్ళి పోతాను. నాకు జీవితంలో మిగిలిన కోరిక అది ఒక్కటే.' పద్మ అకస్మాత్తుగా అతని కళ్ళలోకి చూసింది.

'ఏమిటి?'

సత్యనారాయణ మాట్లాడ లేదు.

'ఏమిటి బావా, అసందర్భంగా మాట్లాడుతున్నావు?'

'అసందర్భం ఏముంది? సరేకాని వివాహ ప్రయత్నంలో ఉన్నారనుకుంటాను మీవాళ్లు.'

'ఏమో' తనలో తానుగా అనుకున్నట్టు అంది పద్మ.

'సంబంధాలు ఆలోచించటం లేదా?'

పద్మ సత్యంవైపు వింతగా, విసుగ్గా చూసింది.

'ఏమిటీ పిచ్చి మాటలు?'

'పెళ్ళిమాటలు పిచ్చి మాటలని ఎవరంటారు?'

'ఈసారి ఇటువంటి మాటలు రానీయకు.'

'పద్మా, మనం దురదృష్టవశాత్తు స్నేహితులమయాం. అలా జరగకుండా ఉండాలిసింది.'

పద్మ భీతితో అతనివైపు కళ్లార్పకుండా చూసింది.

'నామీద నీకు చాలా దయ ఉంది. నేను నీకు ఏమీకాను, కనీసం మనిద్దరం చుట్టాలం కూడా కాదు. అయినా నువ్వు నన్ను చాలా దయతో చూస్తున్నావు. నేను దానికి తగను. మనిద్దరం చిన్నప్పటినించీ ఒకచోట పెరిగాం. చుట్టుపక్కలవాళ్లు కావటంవల్ల మన స్నేహం ప్రగాఢమయింది. స్నేహాన్ని నేను ఒకప్పుడు ప్రేమగా భావించాను.' అతను ఆగాడు. పద

అధః పాతాళంలోకి పోతున్నట్టుగా అనుభూతి పొందింది.

'ఏమిటి బావా, ఇది?'

'పద్మా, నన్ను క్షమించు. నేను భగ్న హృదయుణ్ణి.'

'అంటే...?'

'వివరాలడగకు, పద్మా!'

'అయితే, నువ్వు నన్ను ప్రేమించ లేదా?'

సత్యనారాయణ ఒక్క క్షణం ఆగాడు. తరవాత గట్టిగా గాలిపీల్చి దృఢంగా అన్నాడు.

'లేదు.'

'అయితే, నన్ను కావాలని మోసగించావా?'

'నిన్ను ప్రేమించటం లేదనిమాత్రమే నేను చెప్పదలచుకున్నాను.'

'పద్మ పెదవులు వొణికాయి.'

'నువ్వేనా ఇలా మాట్లాడుతున్నది?'

'నన్ను క్షమించు.'

'నువ్వే నా సర్వస్వ మనుకున్నాను.'

'ఏం చెయ్యను?'

'నా ప్రాణంకంటె అధికంగా ప్రేమించాను. ఇంత అన్యాయం చేస్తావా?'

'నేను నిన్ను ప్రేమించలేక పోయాను. నన్నేం చెయ్యమంటావు?'

'నువ్వు చెప్పినమాటలన్నీ మర్చిపోయావా?'

'నిన్ను వివాహం చేసుకుంటానని ఎప్పుడూ చెప్పలేదు నీకు.'

పద్మ రోషంగా అతనివైపు చూసింది.

'ఇంత నిక్కృష్టంగా మాట్లాడ గలుగుతావని నే నెప్పుడూ అనుకోలేదు.'

సత్యనారాయణ నిశ్చలంగా కిటికీలోంచి దూరంలోకి చూడసాగాడు.

కాసేపటి నిశ్శబ్దం తరవాత పద్మ నెమ్మదిగా అంది.

'కాని నిన్ను ప్రేమించటం నేను మానలేను బావా, నా హృదయంలోని ఆరాటం నీకు తెలిస్తే...

బావా!'

'నువ్వు ఇక వెళ్ళు పద్మా. మనసుని కలవర పెట్టుకోకు.'

'కాని...'

'నువ్వు ఎంత చెప్పినా నా మనసు మార్చుకోలేను. బాగా ఆలోచించే నీతో ఈ విధంగా మాట్లాడాను.'

జుగుప్సతో ఆమె అతనివైపు చూసింది. తరవాత వెళ్ళిపోవటానికి లేచింది.

'ఒక్క మాట ఇయ్యి పద్మా, ఆత్మ హత్య చేసుకోనని.'

'ఆత్మహత్య! నేనంత మూర్ఖురాలిని కాను. కాని ఇంత నీచంగా ప్రవర్తించిన నువ్వు ఆ మాట అన వవసరం లేదు. ఆత్మహత్య చేసుకొని నీ అహంకారాన్ని ఇంకా వృద్ధి చెయ్యను. సెలవు' తిరస్కార సూచకంగా అతనివైపు చూసి గబగబ నడిచిపోయింది పద్మ.

అకస్మాత్తుగా గుండెలో ఏదో బాధ కలిగింది సత్యనారాయణరావుకి. గట్టిగా గుండె మీద చెయ్యివేసి ఆదిమి పద్మ పోయినవైపు చూసి, బరువు తీరినట్టు ఒక్క నిట్టూర్పు విడిచాడు. తరవాత ఒక క్షణం ఆగి అశ్రువులు కారుతుండగా, 'పద్మా, దీర్ఘ సుమంగళీ భవ!' అని చేతుల్లో తల దూర్చి బల్లమీద వాలాడు.

ఇది జరిగిన రెండు రోజులకి సత్యనారాయణ రావు సూపర్ వైజర్ ఉద్యోగంలో జాయన్ కావటానికి వెళ్ళిపోయాడు. అక్కడికి వెళ్ళిన తరవాత అతను తల్లికి ఓ ఉత్తరం రాస్తూ పద్మని పెళ్ళిచేసుకోటం తనకి ఇష్టం లేదని రాసేశాడు. ఆమెకిది ఎంతమాత్రమూ అర్థంకాక పద్మని రహస్యంగా పిలిచి అడిగింది– ఏమైనా పోట్లాడుకున్నారా?' అని. పద్మ లేదంది. తరవాత ఇక ఆ విషయం ఆమె మళ్ళీ ఎత్తలేదు. ఇదిలా ఉండగా మాటలసందర్భంలో పద్మ కూడా తన తలిదండ్రులతో సత్యనారాయణని వివాహం చేసుకోటం తనకిష్టం లేదని చెప్పేసింది.

పద్మకి పరాయి సంబంధం ఓటి స్థిరపరిచారు అన్నివిధాలా పద్మకి తగిన సంబంధమే ఆమె కూడా ఒప్పుకుంది అందరితో బాటు సత్యనారాయణకి కూడా ఆహ్వానం అందింది.

పద్మ వివాహం జరుగుతోంది. 'బావ' కోసం ఆమె చూసింది కాని అతను లగ్నంవేళ కూడా ఎక్కడా కనబడలేదు. అతనిపట్ల ఎంత కోపం ఉన్నా పద్మకి సత్యం రానిలోటు చాలా పూర్తిగా కనుపించింది. ఆశీర్వచనాలు మిన్ను

ముట్టుతున్నాయి. బ్రాహ్మణులు, చుట్టపక్కాలు అక్షింతలు చల్లుతున్నారు. ఇదే సమయంలో అంతా 'సత్యనారాయణ వొచ్చా' డన్నారు. పద్మ తలెత్తి చూసింది. మనిషి మునుపటికంటే తగ్గిపోయాడు. కళ్ళలో కాంతి లేదు. పద్మకి అతన్ని చూడగానే ఏడుపొచ్చింది. ఎలాగో తమాయించుకుంది.

సత్యనారాయణ ఒక నిమిషం అనిమేషంగా పద్మవైపు చూశాడు. అతని గుండెలో ఏదో బాధ అకస్మాత్ గా కలిగింది. చెయ్యిహృదయం మీదఅదిమాడుతర్వాత మంటపం దగ్గరికి వెళ్ళి అక్షింతలుతీసుకుని పద్మకి దగ్గిరిగా వొచ్చి ఉచ్చైస్స్వరంతో 'దీర్ఘ సుమంగళీ భవ!' అన్నాడు. పద్మ తలెత్తి అతనివైపు చూసింది. చప్పున అతను కళ్ళని పక్కకి తిప్పేశాడు—

అశ్రువులు సభాసదుల కోసం వేసిన ఈతాకుల చాపమీద 'టప్ టప్' మని రాలాయి.

సత్యనారాయణ మళ్ళీ వెనక్కి తిరిగి చూడలేదు. పెళ్ళిభోజనం కూడా చెయ్యకుండా వెళ్ళిపోయాడు సరాసరి తను ఉద్యోగంచేసే ఊరుకి. ఆ వెళ్ళిన సత్యనారాయణ మళ్ళీ దాదాపు సంవత్సరం దాకా ఇంటిముఖం చూడలేదు. ఇంటికి రావటం కూడా పుట్టెడు జ్వరంతో వొచ్చాడు. అది టైఫాయిడ్ అన్నాడు డాక్టరు.

ఇరవై ఒకటో రోజు గడవాలి. కావలసిన వాళ్ళంతా వొచ్చారు. ఓసారి కళ్ళు విప్పి అడిగాడు. సత్యనారాయణ 'పద్మ వొచ్చిందా?'

'టెలిగ్రాం ఇచ్చాం బాబూ, ఈపాటికి వొస్తూ ఉంటుంది.' అంది అతని తల్లి బీదుతూ

కాసేపటి తర్వాత - సత్యనారాయణ తల్లిని ఏకాంతంగా పిలిచి తన డైరీని తెప్పించాడు. తరవాత దాంట్లో ఒక పేజీ గుర్తుగా మడిచి ఆమెతో అన్నాడు.

'అమ్మా, నేను ఒకవేళ బతకకపోతే, ఈ కాగితంలో రాసిఉన్నది చదువు. చదవంగానే ఆ పేజీ చింపి తగులబెట్టివెయ్యి. దాంట్లోని విషయం మాత్రం ఎవరికీ చెప్పకు. ఎంతమాత్రం చెప్పకూడదు.' ఒక్క నిట్టూర్పు విడిచి సత్యనారాయణ మళ్ళీ అన్నాడు. 'మనసులోని రహస్యం ఎవరితోనైనా చెప్పివేస్తేగాని మనసుకి ఉపశాంతి ఉండదు. ఇప్పుడు నా మనసులోని బరువుతీరింది. కాని ఈ విషయం నువ్వు ఎవరికీ చెప్పొద్దమ్మా.'

'చెప్పను బాబూ' అందామె జలజల రాలే కన్నీళ్ళను తుడుచుకుంటూ.

సాయంత్రానికి పద్మ వొచ్చింది. సత్యాన్ని చూడగానే ఆమె ఆవురుమంది.

'బావా!'

సత్యనారాయణ కళ్ళు విప్పాడు.

'ఎవరు, పద్మా! పద్మా. నా పద్మా! దీర్ఘ సుమంగళీభవ!' సత్యనారాయణ మాట్లాడిన ఆఖరు మాటలు ఇవే; ప్రశాంతంగా కళ్ళు మూశాడు; మళ్ళీ తెరవలేదు.

'దీర్ఘ సుమంగళీ భవ!'— ఈ ఆశీర్వచనం వెనక దాగిన కథ పద్మకి తెలిస్తే ఆమె ఆ క్షణంలో అక్కడే మరణించి, ఉండేది. కాని ఆ విషయం ఆమెకి తెలియదు, తెలియబోదు. తెలియరాదని సత్యనారాయణ అనుశాసనం. కాగా హృదయం పగిలి వొచ్చిన 'బావా!' అనే ఒక్క మాట, ప్రేమపూర్వకమైన అశ్రువులు మాత్రం పద్మ సమర్పించ గలిగింది సత్యానికి.

తన డైరీలో సత్యం గుర్తుపెట్టిన పేజీలో ఇలా రాసి ఉంది:

'ఇవాళ జ్యోతిష్కుడు నా జాతకం చూడటం సంభవించింది. ఇరవై మూడో ఏటితో నా జీవితం ఆఖరని ఖండితంగా చెప్పాడాయన, ఇంకో విషయం నాకిప్పుడు స్ఫురణకి వొస్తోంది. మా తండ్రి, తాత, ముత్తాతలు ఎవరూ కూడా 30 ఏళ్ళు దాటి బతకలేదట. మా ముత్తాత, తాత, తండ్రి వరసగా ఇరవైతొమ్మిది, ఇరవై ఏడు, ఇరవై అయిదో ఏట చచ్చిపోయారట.

జ్యోతిషంలో నాకంత నమ్మకం లేకపోయినా ఈ పైవిషయాల ప్రకారం నాజీవితం 23వ పడిలో ఆఖరనే దృఢవిశ్వాసం నాకు కలిగింది.

'అయితే, నా ప్రాణంలో ప్రాణమైన నా పద్మ సంగతేమిటి?' పద్దెనిమిదో ఏటే ఆమె వైధవ్యం అనుభవించాలా? దుస్సహం. అసంభవం. ఏమైనా సరే ఇలా జరగటం నేను సహించలేను. కాని నే నామెను ప్రేమించినంతగా పద్మకూడా నన్ను ప్రేమిస్తోంది. ఆమెకి నచ్చ చెప్పటంలో ఫలితం ఉంటుందా అనేది సందేహాస్పదం. ఏమైనా సరే, నా పద్మకి ఈ ఉపద్రవం రాకూడదు. ఏ విధానంవల్లనైనా సరే ఆమె రక్షించబడాలి. నా ప్రాణాధికమైన నా పద్మా! దీర్ఘ సుమంగళీ భవ!'